ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

మంగళవారం 19-05-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 338 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## ప్రధాని మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం



న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం): ప్రధాని మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. స్వీడన్ దేశపు అత్యున్నత పురస్కారంతో ఆయనను సత్కరించారు. 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, కమాండర్ గ్రాండ్ క్రాస్‌తో మోడీని సత్కరించింది స్వీడన్ ప్రభుత్వం. ఒక ప్రభుత్వ అధినేతకు స్వీడన్ అందించే అత్యున్నత స్థాయి గుర్తింపు, గౌరవం ఇదే కావడం గమనార్హం. దీంతో అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు ప్రధాని మోడీ దక్కించుకున్న పురస్కారాల సంఖ్య 31కు చేరింది.

## ఆంధ్రప్రదేశ్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్

అమరావతి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి మరో భారీ మైలురాయి దక్కింది. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ 'రాయల్ ఎన్‌ఫీల్డ్' రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం వనేలూరు, రాళ్లకుప్పం గ్రామాలలో సమీకృత మోటార్ సైకిల్ తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసే విషయమై రాయల్ ఎన్‌ఫీల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ బి. గోవిందరాజన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కీలక చర్చలు జరిపింది. ఏపీ ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం, పచ్చని ఇంధన వనరులు, నైపుణ్యం కలిగిన యువత రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రయాణానికి ఎంతగానో తోడ్పడతాయని చంద్రబాబు అన్నారు.




2 లో

ప్రతిపాదిత ప్రాజెక్టు కింద రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ దాదాపు రూ. 2,500 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ఏడాదికి ఏకంగా 9 లక్షల మోటార్ సైకిళ్లను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని నిర్మించనున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో అత్యాధునిక తయారీ కేంద్రంతో పాటు, వాహనాల నాణ్యతను పరీక్షించే టెస్టింగ్ ట్రాక్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ) సెంటర్, అలాగే అనుబంధ పరిశ్రమల కోసం ఒక ప్రత్యేక వెండర్ పార్క్ ఎకోసిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

## ఖరీఫ్‌కు నీటి విడుదలపై ప్రభుత్వం ఫోకస్

### కృష్ణా, గోదావరి డెల్టాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం



2 లో

న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం): ఖరీఫ్ సాగుకు అవసరమైన నీటి విడుదలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో సోమవారం సచివాలయంలో మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు మరియు ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు.. కృష్ణా, గోదావరి డెల్టాలకు ఖరీఫ్ నీటి విడుదలపై సమగ్రంగా చర్చించనున్నారు.ౖరైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి




2 లో

తాడేపల్లి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిశిత దృష్టి సారించింది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ, పార్టీ సంస్థాగత సన్నద్ధతపై ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పార్టీ నాయకత్వం దిశా నిర్దేశం చేసింది.

ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీఫ్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీ ఒక నమ్మకమైన భాగస్వామి



2 లో

ఇది కద నిజం: ఢిల్లీ: న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ , యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" పేరిట ఒక ఉన్నత స్థాయి సదస్సును నిర్వహించాయి. అమెరికాకు చెందిన ప్రముఖ అణుశక్తి నిపుణులు, ప్రతినిధులు హాజరైన ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చడంలో అణుశక్తి కీలక పాత్ర పోషిస్తుందని, గ్లోబల్ న్యూక్లియర్ ఎకానమీలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతామని ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు.

# పెట్రోల్ ఉద్యమ జ్వాల






- రాష్ట్రవ్యాప్తంగా హోరెత్తిన నిరసనలు..
- వినూత్న రీతిలో వైసిపి శ్రేణుల ఆందోళన
- పెరిగిన పెట్రోల్ ధరలపై మండిపడ్డ నేతలు
- తక్షణమే తగ్గించాలని డిమాండ్

**అమరావతి (ఇది కద నిజం):**

ఆంధ్రప్రదేశ్ అంతటా పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాలలో వైసిపి శ్రేణులు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ప్రదర్శించారు. సామాన్యుడి నడ్డి విరుస్తున్న ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జనసమీకరణతో ప్రధాన కూడళ్లన్నీ వైసిపి జెండాలతో నిండిపోయాయి.

### వినూత్న శైలిలో నిరసనలు

కేవలం ధర్నాలు, రాస్తారోకోలకే పరిమితం కాకుండా, ప్రజలను ఆకట్టుకునేలా వైసిపి నాయకులు వినూత్న పద్ధతుల్లో తమ నిరసనను వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను ఎడ్ల బండ్లపై ఎక్కించి ఊరేగించారు. మరికొన్ని చోట్ల నేతలు, కార్యకర్తలు స్వయంగా కార్లను, ఆటోలను తాళ్లతో లాగుతూ రోడ్లపై నడిచారు. పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి వాహనదారులకు పూలు ఇచ్చి, పెరిగిన ధరల భారాన్ని వివరిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

### మహిళల వంటావార్పు..:

ధరల పెరుగుదల ప్రభావం వంటింటిపై తీవ్రంగా పడిందంటూ వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపైనే వంటావార్పు కార్యక్రమాలు చేపట్టారు. కట్టెల పొయ్యిలపై వంటలు చేస్తూ, సామాన్య కుటుంబాలు బతికే పరిస్థితి లేదంటూ నినాదాలు చేశారు. పెట్రోల్ ధరల పెంపు రవాణా రంగాన్ని దెబ్బతీస్తుందని, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయని మహిళా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రజా ద్రోహం: వైసిపి ముఖ్య నేతలు

ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలపై మోయలేని భారం వేయడం ముమ్మాటికీ ప్రజా ద్రోహమేనని మండిపడ్డారు. లీటర్ పెట్రోల్ ధర వంద దాటి ఎక్కడికో వెళ్ళిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని, పన్నుల పేరుతో సామాన్యులను దోచుకుంటున్నారని ఆరోపించారు.

### అన్ని వర్గాల మద్దతు

వైసిపి చేపట్టిన ఈ ఆందోళనలకు లారీ అసోసియేషన్లు, ఆటో కార్మిక సంఘాలు మరియు సామాన్య వాహనదారులు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. పెట్రోల్, డీజిల్ ధరల వల్ల తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను నిరసన వేదికలపై పంచుకున్నారు. ఈ పోరాటం కేవలం ఒక పార్టీది కాదని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడి సమస్య అని వైసిపి నేతలు పేర్కొన్నారు.

### వెనక్కి తగ్గే వరకు పోరాటం ఆపబోం

ప్రభుత్వం స్పందించి పెంచిన ఇంధన ధరలను తక్షణమే తగ్గించకపోతే తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వైసిపి హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా, వినూత్నంగా సాగిన ఈ నిరసనలు ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని, లేదంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని పార్టీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## సుప్రీంకోర్టు లో బ్రేకులు



ఇది కద నిజం: హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న ప్రముఖ కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పార్క్ చుట్టుపక్కల ఉన్న పచ్చదనాన్ని కాపాడాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం, చెట్ల నరికివేతపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ సరిహద్దుల నుండి 35 మీటర్ల పరిధిలో ఉన్న ఎలాంటి చెట్లను కూడా నరకడానికి వీల్లేదని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

2 లో

## కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం



2 లో

ఇది కద నిజం : కేరళ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీడీ సతీశన్ ఘనంగా ప్రమాణస్వీకారం చేశారు. తిరువనంతపురం లో ఏర్పాటు చేసిన ఈ పండగ వాతావరణ వేడుకలో రాష్ట్ర గవర్నర్ ఆయన చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న సతీశన్ కేరళ పగ్గాలు చేపట్టడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం వ్యక్తమవుతోంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రమాణస్వీకారం అనంతరం ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ ప్రతిష్టాత్మక వేడుకకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్రనాయకత్వంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు తరలివచ్చారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 19-05-2026

# ఆంధ్రప్రదేశ్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్

మొదటి పేజీ తరువాయి

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో దాదాపు 15,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి, ఇది స్థానిక ఆర్థిక వృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి ఎంతగానో దోహదపడనుంది.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేసి, పనులను వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. సంస్థ ప్రతిపాదించిన 24 నెలల గడువు కంటే ముందే, కేవలం 18 నెలల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించింది. ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వేగానికి తగ్గట్లుగానే, రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా ప్రాజెక్ట్ అమలులో అంతే వేగాన్ని ప్రదర్శించాలని స్పష్టం చేసింది.

ఈ చర్చల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ 'ఫ్లయింగ్ ఫ్లీ సీ6' గురించిన వివరాలను ప్రతినిధులు పంచుకున్నారు. భవిష్యత్ సస్టైనబుల్ మొబిలిటీ రంగానికి ఆంధ్రప్రదేశ్ లోని సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి భారీ పునరుత్పాదక ఇంధన వనరుల వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని ప్రభుత్వం వివరించింది. పర్యావరణ అనుకూల రవాణా, ఇంధన భద్రత వైపు దేశం అడుగులు వేస్తున్న తరుణంలో, భవిష్యత్ మొబిలిటీ, అధునాతన ఉత్పాదక రంగం మరియు గ్రీన్ ఇండస్ట్రియల్ గ్రోత్‌కు ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించింది.

# ఏపీ ఒక నమ్మకమైన భాగస్వామి

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమల స్థాపనకు మరియు విదేశీ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని మంత్రి లోకేష్ ఈ సదస్సులో వివరించారు. రాష్ట్రంలో ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, పుష్కలమైన వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు అణుశక్తి రంగానికి సంబంధించిన ప్రాజెక్టులకు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో, ఐటీ మరియు ఉన్నత విద్యారంగంలో ఏపీ సాధిస్తున్న ప్రగతిని వివరిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అణుశక్తి పరిశ్రమల స్థాపనకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

భారతదేశం, అమెరికా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా ఇంధన భద్రత సాధించడంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడంలో న్యూక్లియర్ ఎనర్జీ ప్రాధాన్యతను అమెరికా ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను చేరుకోవడానికి భారతదేశంలో, ముఖ్యంగా ప్రగతిశీల రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు యూఎస్ న్యూక్లియర్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఈ సదస్సు ద్వారా లభించిన అవకాశాలను ఉపయోగించుకుని ఏపీకి పెద్ద ఎత్తున అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి లోకేష్ అమెరికా ప్రతినిధి బృందంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంస్థల సహకారంతో రాష్ట్రంలో సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేష్ పునరుద్ఘాటించారు.

## ఖరీఫ్‌కు నీటి విడుదలపై ప్రభుత్వం ఫోకస్
## కృష్ణా, గోదావరి డెల్టాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం

మొదటి పేజీ తరువాయి

మే 15 నుంచే ఖరీఫ్‌కు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించిన నేపథ్యంలో అధికారులు వేగంగా చర్యలు చేపట్టారు.

ఈ సమావేశంలో ప్రస్తుత జలాశయాల్లో నీటి లభ్యత, వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, డెల్టాలకు నీటి విడుదల తేదీలు, సాగునీటి పంపిణీ విధానం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వినియోగంలో సమన్వయం పాటించాలని మంత్రులు అధికారులకు సూచించనున్నారు.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని, సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# బస్తర్ రూపురేఖలు మారుస్తాం

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన



న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం): ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బస్తర్ జిల్లాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి, భద్రతకు సంబంధించి పలు కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా బస్తర్ ప్రాంత సమగ్ర అభివృద్ధి, శాంతిభద్రతలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో మావోయిజాన్ని దాదాపు అంతం చేశామని అమిత్ షా అన్నారు. బస్తర్ ప్రాంత రూపురేఖలను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించిందని వెల్లడించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన 70 భద్రతా క్యాంపులను ఇకపై 'సేవా కేంద్రాలు'గా మార్చబోతున్నట్లుగా ప్రకటించారు. ఈ కేంద్రాల ద్వారా స్థానిక గిరిజన ప్రజలకు రేషన్, వైద్యం, విద్య వంటి అన్ని ప్రభుత్వ సేవలను ఒకేచోట అందిస్తామని అమిత్ షా పేర్కొన్నారు.

బస్తర్‌లో గుజరాత్ తరహా మోడల్..

బస్తర్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గుజరాత్ తరహా అభివృద్ధి నమూనాను ఇక్కడ అమలు చేస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణం, కమ్యూనికేషన్ వ్యవస్థల బలోపేతం ద్వారా బస్తర్ యువతకు స్థానికంగానే ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. బస్తర్ యువతలో అపరమైన ప్రతిభ దాగి ఉందని.. వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు. అందుకు ఒలింపిక్స్ ప్రమాణాల తరహాలో ఇక్కడ క్రీడా మౌలిక వసతులను కల్పిస్తామని, గ్రామీణ స్థాయి క్రీడలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని అమిత్ షా ప్రకటించారు.

# కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ జాతీయ నేతలు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ అగ్రనేతలు ముఖ్యమంత్రి సతీశన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, కూటమి భాగస్వామ్య పక్షాల అగ్రనేతలు ఈ వేడుకకు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. జాతీయ స్థాయిలో ఈ ప్రమాణస్వీకారోత్సవం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

సతీశన్ ప్రమాణస్వీకారానికి కేరళ నలుమూలల నుండి వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తిరువనంతపురానికి తరలివచ్చారు. సభా ప్రాంగణమంతా పార్టీ జెండాలు, నినాదాలతో హోరెత్తింది. కేరళ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అవినీతి రహిత మరియు పారదర్శక పాలనను అందిస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ అధిష్టానం నూతన ముఖ్యమంత్రిపై నమ్మకం వ్యక్తం చేసింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడంతో పాటు, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తామని పార్టీ నేతలు ప్రకటించారు.

దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సతీశన్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా సానుకూల స్పందన వస్తోంది. ప్రమాణస్వీకారం ముగిసిన వెంటనే ఆయన సచివాలయానికి చేరుకుని అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలన, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతంపైనే తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ముఖ్యమంత్రి సతీశన్ తొలి ప్రకటనలో వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ కేరళను ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రత్యేక ఆకర్షణగా రేవంత్ రెడ్డి

కేరళం సీఎం సతీశన్ ప్రమాణ స్వీకారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొత్త మంత్రులు అంతా వచ్చి ఆశీస్సులు తీసుకొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా గ్రూప్ ఫోటో తీసుకొన్నారు.

## ప్రధాని మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం

మొదటి పేజీ తరువాయి

ఇక అంతకు ముందు, స్వీడన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ ఘన స్వాగతం పలికారు. ఇది ఇలా ఉండగా ప్రధాని నరేంద్ర మోడీకి స్వీడన్ అత్యున్నత పౌర పురస్కారం అందించడంపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించింది. ప్రధాని మోడీ చేసిన విశేష కృషి, దార్శనిక నాయకత్వానికి గుర్తింపుగా స్వీడన్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు వెల్లడించింది కేంద్ర సర్కార్. ఇది ఇండియాకు గర్వ కారణమని తెలిపింది.

# తెలంగాణలో పెన్షన్ జాతర



**న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం):** తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న వారికి తీపి కబురు. జూన్ 2 నుంచి అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల కొత్త పింఛన్ల మంజూరుకు పూర్తి స్థాయిలో ఆమోదముద్ర వేసిందని ఆయన వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వకుండా ప్రజలను వంచించిందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు.

తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. నిరుద్యోగులకు ఆధునిక టెక్నాలజీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు మిర్యాలగూడ, నకిరేకల్ నియోజకవర్గాల్లో త్వరలోనే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

అదేవిధంగా, టామ్‌కామ్ సంస్థ ద్వారా యువతకు విదేశీ భాషలు నేర్పించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జర్మనీలో సుమారు 5 లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని మన యువతకు జర్మన్ భాష నేర్పించేందుకు ప్రత్యేకంగా ఫ్యాకల్టీని నియమిస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.90 కోట్లు కేటాయించారని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలన్నింటికీ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో వడ్ల కొనుగోళ్లు అత్యంత పారదర్శకంగా జరుగుతున్నాయని గతంలో లాగా కాకుండా సకాలంలో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు నేరుగా జమ అవుతున్నాయని స్పష్టం చేశారు. పరిశ్రమలలో కార్మికుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఫ్యాక్టరీలలో రక్షణ ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఫార్మా రంగంలో జరుగుతున్న వరుస ప్రమాదాల నివారణకు, కార్మికుల ప్రాణ రక్షణకు త్వరలోనే అత్యంత కఠినమైన నూతన విధివిధానాలను తీసుకురానున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, అదే సమయంలో జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత పరిశీలకులదేనని ఆయన గుర్తుచేశారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఓటర్ల జాబితాలో పొరపాట్లు జరగకుండా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సజ్జల సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా పనిచేసేలా చూడాలని, ప్రతి ఇల్లు తిరిగి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా అర్హత ఉండి ఓటు లేని యువతీ యువకులను గుర్తించి, వారి చేత ఫారం-6 పూరింపజేసి సకాలంలో దరఖాస్తు చేసేలా సహాయపడాలన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమ తొలగింపులు లేదా తప్పుడు ఓట్ల నమోదు వంటి అంశాలు ఎక్కడైనా గమనిస్తే తక్షణమే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఓటు హక్కు సంరక్షణే ధ్యేయంగా వైసిపి శ్రేణులు కదలాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ముగిసే వరకు నిరంతరం నియోజకవర్గాల్లో పర్యటిస్తూ, క్షేత్రస్థాయి నాయకులను సమన్వయం చేసుకోవాలని పార్లమెంటరీ పరిశీలకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దాన్ని కాపాడుకోవడంలో వైసిపి ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా పార్టీ నేతలు స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టు లో బ్రేకులు


మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం కింద తెలంగాణ ప్రభుత్వం కేబీఆర్ పార్క్ చుట్టూ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే, ఈ ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం వందలాది ఏళ్ల నాటి వృక్షాలను నరికివేయాల్సి రావడంతో పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు గత కొంతకాలంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు స్టే విధించడంతో, ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

నగరానికి ఊపిరితిత్తి లాంటి కేబీఆర్ పార్క్ పచ్చదనాన్ని కాపాడుకునేందుకు దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ప్రభుత్వ అభివృద్ధి పనుల కంటే పర్యావరణ సంరక్షణ కూడా అంతే ముఖ్యమని అభిప్రాయపడింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి పనులు వేగవంతం చేయాలని చూస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీ అధికారులకు సుప్రీంకోర్టు నిర్ణయం గట్టి ఎదురుదెబ్బగా మారింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఫ్లైఓవర్ డిజైన్ల మార్పు లేదా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు, పర్యావరణ నివేదికలను పరిశీలించాల్సి ఉందని పేర్కొంటూ సుప్రీంకోర్టు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది. ఈ లోగా ఇరుపక్షాలు తమ పూర్తి స్థాయి వాదనలను, అఫిడవిట్లను దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. జులై చివరి వారం వరకు ఈ స్టే అమలులో ఉండనుండటంతో, కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ప్రస్తుతానికి చెట్లకు ముప్పు తప్పినట్లయిందని పర్యావరణ వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పేపర్ వాల్యుయేషన్‌లో ఘోర తప్పిదం
## లెక్చరర్‌కు రూ.7,500 ఫైన్, మూడేళ్లు డిబార్





న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఫలితాల పేపర్ వాల్యుయేషన్‌లో నిర్లక్ష్యం వహించిన ఓ లెక్చరర్‌కు ఇంటర్ బోర్డు గట్టి షాక్ ఇచ్చింది. పరీక్షల్లో విద్యార్థినికి టాప్ మార్కులు వస్తే.. కేవలం సింగిల్ డిజిట్ మార్కులు వేసి ఫెయిల్ చేసినందుకు గానూ సదరు అధ్యాపకుడిపై ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకున్నది. గుంటూరు జిల్లాకు చెందిన కావ్య అనే విద్యార్థిని ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో బోటనీ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. బాగా చదివే తనకు తక్కువ మార్కులు రావడం, అది కూడా ఫెయిల్ కావడంపై అనుమానం వచ్చిన కావ్య రీ-వెరిఫికేషన్, జవాబు పత్రం స్కాన్డ్ కాపీ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే, జవాబు పత్రాన్ని పరిశీలించిన అధికారులకు లెక్చరర్ చేసిన ఘోర తప్పిదం బయటపడింది. విద్యార్థిని కావ్యకు బోటనీ పరీక్షలో 60 మార్కులకు గానూ 60 (60/60) మార్కులు వచ్చాయి. కానీ, పేపర్ దిద్దిన లెక్చరర్ నిర్లక్ష్యంగా ఓ సున్నాను (0) వదిలేసి, కేవలం 6 మార్కులు మాత్రమే వేసి ఆమె ఫెయిల్ అయ్యేందుకు కారణం అయ్యాడు.

జరిమానా, మూడేళ్ల పాటు డిబార్..

అయితే, విద్యార్థిని భవిష్యత్తుతో ఆడుకున్న లెక్చరర్ నిర్లక్ష్యంపై ఇంటర్మీడియట్ బోర్డు తీవ్రంగా పరిగణించింది. సదరు లెక్చరర్‌కు రూ.7,500 జరిమానా విధించడమే కాకుండా, రాబోయే 3 పాటు ఎలాంటి పరీక్షల పేపర్ వాల్యుయేషన్‌లో పాల్గొనకుండా డిబార్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

# ఈడీ ఉచ్చులో సిట్టింగ్ మంత్రి.. రూ.100 కోట్ల మనీలాండరింగ్ కేసులో జైలుకు!



న్యూస్ డెస్క్, 18 మే (ఇది కద నిజం): రూ.100 కోట్ల నకిలీ జీఎస్టీ బిల్లింగ్, మనీలాండరింగ్ రాకెట్ కేసులో పంజాబ్ ఇండస్ట్రీస్ శాఖ మంత్రి సంజీవ్ అరోరాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు సోమవారం ఆయనకు జుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొద్దిరోజులుగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడి) కస్టడీలో ఉన్న మంత్రిని, ఈడీ విచారణ ముగియడంతో కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలోనే న్యాయస్థానం ఆయనకు జుడీషియల్ రిమాండ్ విధించింది.

అసలు ఏం జరిగింది?

మొబైల్ ఫోన్ల ట్రేడింగ్ పేరుతో షెల్ (నకిలీ) కంపెనీలను సృష్టించి, సుమారు రూ. 100 కోట్లకు పైగా నకిలీ జీఎస్టీ బిల్లులు సృష్టించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను మే 9వ తేదీన చండీగఢ్‌లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. మంత్రి అరోరాకు లింకులు ఉన్న కొన్ని సంస్థలు, ఢిల్లీలోని బోగస్ కంపెనీల ద్వారా అనుమానాస్పద లావాదేవీలు జరిపినట్లు ఈడీ నిర్ధారించింది. ఈ దర్యాప్తులో భాగంగానే గతంలో ఢిల్లీ. ఛండీగఢ్, గురుగావ్ పరిసర ప్రాంతాల్లో ఈడీ విస్తృతంగా సోధాలు కూడా నిర్వహించింది.

కోర్టు ఆదేశాలు ఇవే..

కోర్టు విచారణ ప్రారంభానికి ముందు, అరెస్ట్ అయిన తర్వాత మొదటిసారిగా సంజీవ్ అరోరా కుటుంబ సభ్యులు కోర్టు ప్రాంగణంలోనే ఆయనను కాసేపు కలుసుకున్నారు. అంతకుముందు ప్రత్యేక న్యాయమూర్తి నరేంద్ర సురా.. నిందితుడు అరోరా ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి 11 గంటల మధ్య ఒక గంట పాటు తన న్యాయవాదిని కలుసుకునేందుకు ఈడీకి అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా, జైలు వైద్యాధికారి సూచించిన విధంగా ఆయనకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు, మందులను అందించాలని కోర్టు ఆదేశించింది. తన సొంత న్యాయవాదిని నియమించుకునేందుకు మరియు వకాలత్నమాపై సంతకం చేయడానికి అనుమతించాలంటూ అరోరా దాఖలు చేసిన దరఖాస్తుకు ఈడీ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సైమన్ బెంజమిన్ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దీంతో కోర్టు ఈ విజ్ఞప్తిని స్వీకరిస్తూ, వకాలతానామా పత్రాలను వెంటనే ఆయన లాయర్ లేదా కుటుంబ సభ్యులకు అందజేయాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను కోర్టు వచ్చే జూన్ 1వ తేదీకి వాయిదా వేసింది. పంజాబ్లో సిట్టింగ్ మంత్రి ఒకరు మనీలాండరింగ్ కేసులో జుడీషియల్ కస్టడీకి వెళ్లడం అక్కడి రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

Registered No : APTEL/25/A0818

# జమ్మూ కశ్మీర్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో క్యాసారం కుర్రాడు 'క్రిష్ గౌడ్' ఘన విజయం

- కరాటే ప్రీమియర్ లీగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటిన క్రిష్ గౌడ్
- క్యాసారం గ్రామంలో సంబరాలు
- మాస్టర్ శ్రీనివాస్ శిక్షణపై ప్రశంసలు



ఇది కద నిజం, క్యాసారం: జమ్మూ & కశ్మీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'కరాటే ప్రీమియర్ లీగ్ నేషనల్ లెవెల్ టోర్నమెంట్–2026'లో క్యాసారం గ్రామానికి చెందిన కరాటే క్రీడాకారుడు ఎన్. క్రిష్ గౌడ్ అద్భుత ప్రదర్శనతో సరికొత్త రికార్డు సృష్టించాడు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులతో హోరాహోరీగా సాగిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో క్రిష్ గౌడ్ తన అసాధారణ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో ఎస్ ఎస్ కె ఐ టీమ్ తరపున బరిలోకి దిగిన క్రిష్ గౌడ్, ఫైనల్ రౌండ్లలో తిరుగులేని నైపుణ్యాలు, పట్టుదల ప్రదర్శించి ప్రేక్షకులను, క్రీడా నిపుణులను ఎంతగానో ఆకట్టుకున్నాడు. జాతీయ స్థాయి వేదికపై పతకం సాధించి, క్యాసారం గ్రామం పేరు దేశవ్యాప్తంగా మారుమోగేలా చేసిన క్రిష్ గౌడ్ ప్రదర్శన పట్ల క్రీడా నిపుణులు హర్షం వ్యక్తం చేశారు. అతనికి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు మరిన్ని ఉన్నత అవకాశాలు ఉన్నాయని ప్రశంసించారు. క్రిష్ గౌడ్ సాధించిన ఈ భారీ విజయంతో క్యాసారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు విజేత క్రిష్ గౌడ్‌కు మరియు మాస్టర్ శ్రీనివాస్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో క్రిష్ గౌడ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిగమించాలని ఆకాంక్షించారు

# లింగంపల్లిలో బయోమాస్ పెల్లెట్స్, వుడ్ గ్యాసిఫయర్ స్టవ్‌లపై అవగాహన సదస్సు

## పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం



ఇది కద నిజం, నవాబుపేట్: వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామంలో బయోమాస్ పెల్లెట్స్ వుడ్ గ్యాసిఫయర్ స్టవ్‌ల ప్రాధాన్యత, వాటి అవసరంపై స్థానిక మహిళలు, యువత మరియు పెద్దలకు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా JKMR ఫౌండేషన్ వారు తయారు చేసిన వుడ్ గ్యాసిఫాయర్ స్టవ్‌పై పరమాన్నం వండి, దానిని ఎలా ఉపయోగించాలో గ్రామస్తులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ స్టవ్‌లకు అవసరమైన పెల్లెట్స్ ప్రస్తుతం స్థానిక పరిశ్రమల్లో అందుబాటులో ఉన్నప్పటికీ, ఏ గ్రామానికి ఆ గ్రామమే తమ వ్యవసాయ వ్యర్థాలతో సొంతంగా ఈ పెల్లెట్స్‌ను తయారు చేసుకుని వాడుకునేలా స్వయంసమృద్ధి సాధించడమే తమ ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో, భవిష్యత్తులో మన దేశానికి ఎల్‌పీజీ కొరత ఏర్పడితే ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయంగా మనం సిద్ధంగా ఉండాలని, ఎల్‌పీజీ కంటే ఈ బయోమాస్ పెల్లెట్స్ ఎంతో తక్కువ ఖర్చుతో కూడుకున్నవని వారు వివరించారు. మన దేశం ఏటా వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, వంట నూనెల దిగుమతుల కోసం ఖర్చు చేస్తోందని, వీటికి బదులు స్వదేశీ ఇంధనాల వైపు మారితే దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేసినవారమవుతామని పేర్కొన్నారు. దేశంలో వంట నూనెల కొరతను అధిగమించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం నూనెగింజల పంటలను దేశంలోనే పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అవగాహన సదస్సులో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, లింగంపల్లి సర్పంచ్ వి. శోభ, ఉప సర్పంచ్ ప్రవీణ శ్రీకాంత్ రెడ్డి, నవాబుపేట్ మండలం బీజేపీ అధ్యక్షులు చంద్రకాంత్, మాజీ ఎంపీటీసీ పరమేష్, వార్డు సభ్యులు పాండురంగం, పండు, గౌతమి, పావని మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సైకిల్ పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటన.



ఇది కద నిజం: సోమవారం ఉదయం 6 గంటల నుండి యాదగిరిగుట్ట నుండి ఆలేరు వరకు సైకిల్‌పై ప్రయాణించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో పేద మరియు సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో సామాన్య ప్రజలు మళ్లీ సైకిళ్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అనంతరం వంగపల్లి మీదుగా ప్రయాణిస్తూ అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వడ్ల కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు పారదర్శకంగా మరియు వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో లారీలు, తూకం, హమాలీలు వంటి సౌకర్యాలు సమయానికి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# శ్రీ బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఇది కద నిజం:"వచ్చే రోజుల్లో పదిమంది కురుమ బిడ్డలు ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టాలి. కురుమ సమాజం రాజకీయంగా, సామాజికంగా మరింత బలపడాలి" అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఉప్పల్ రామంతపూర్‌లో నిర్వహించిన శ్రీ బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కురుమలు అంటే నమ్మకానికి మారుపేరని అన్నారు. సమాజం కోసం కష్టపడే స్వభావం, ఇచ్చిన మాట నిలబెట్టుకునే గుణం కురుమల ప్రత్యేకత అని కొనియాడారు. కురుమ సమాజం ఐక్యంగా ఉంటే రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం సాధించగలదని, యువత ముందుకు వచ్చి నాయకత్వ బాధ్యతలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# సికింద్రాబాద్‌లో సీఎం సహాయ నిధి చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలు పంపిణీ చేసిన పద్మారావు గౌడ




ఇది కద నిజం, సికింద్రాబాద్, మే 18 : పేద ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని, ప్రభుత్వాలు సైతం ప్రజా శ్రేయస్సే పరమావధిగా పని చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్. ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం సితాఫలమండీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 21 మంది లబ్దిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. ద్వారా మంజూరైన సుమారు రూ.9 లక్షల విలువజేసే చెక్కులను, ముగ్గురు రోగులకు రూ. 10.25 లక్షల విలువజేసే ఎల్.ఓ.సి. పత్రాలను పద్మారావు గౌడ్ అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలకు అధునాతన వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన నేపథ్యంలో సికింద్రాబాద్ కు చెందిన అత్యధికులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉరటని కల్పిస్తున్నామని తెలిపారు. దళారీల ప్రమేయం లేకుండా, డబ్బులు పొందేందుకు ఎవ్వరికీ లంచాలు చెల్లించాల్సి అవసరం లేదని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సితాఫలమండీ లోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీ ఆర్ ఎస్ యువ నేత రామేశ్వర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21 మందికి రూ. 9 లక్షల విలువజేసే చెక్కులతో పాటు చిలకలగూడ కు చెందిన షిఫా సుల్తానా కు రూ. ఆరు లక్షలు, పార్సిగుట్ట కు చెందిన చిరంజీవి సంపత్ కు రూ. రెండు లక్షలు, వారసిగూడ కు నాగులురి మరియకు రూ. 2.25 లక్షలు విలువజేసే ఎల్.ఓ.సి. పత్రాలను పద్మారావు గౌడ్ అందించారు.

# విద్యుత్ కనెక్షన్లు వెంటనే పునరుద్దరించాలి

ఇది కద నిజం,సికింద్రాబాద్ : అడ్డగుట్ట లో ఆజాద్ చంద్ర శేఖర్ నగర్ లో రోడ్డు నిర్మాణం సందర్భంగా తమ ప్రాంత విద్యుత్ వైర్లు తెగిపోయాయని, వెంటనే పునరుద్దరించాలని కోరుతూ బస్తీ వాసులు ఆదివారం సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ను సీతాఫలమండీ లోని క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. వెంటనే జీ. హెచ్.ఎం సి , ట్రాన్స్ కో అధికారులను సంప్రదించిన పద్మారావు గౌడ్ విద్యుత్ సరఫరాను పునరుద్దరించే ఏర్పాట్లు జరపాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణం పనులకు జరిపే తొవ్వకాల్లో మంచినీరు, సివరేజీ, విద్యుత్ వంటి పనులకు ఆటంకాలు ఏర్పడకుండా బల్దియా అధికారులు జాగ్రత్తలు పాటించాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాండు మృతి పట్ల ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సంతాపం



ఇది కద నిజం,సికింద్రాబాద్: నార్త్ లాలగూడకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాండు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సోమవారం నాడు నార్త్ లాలగూడ ఇందిరా నగర్‌లోని పాండు స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాండు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుడికి అంజలి ఘటించారు.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిస్సార్‌ను పరామర్శించిన యువ నేత రామేశ్వర గౌడ్



ఇది కద నిజం,సికింద్రాబాద్: అనారోగ్యానికి గురై ప్రస్తుతం కోలుకుంటున్న వారాసిగూడ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నిస్సార్‌ను సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యువ నేత తీగుళ్ళ రామేశ్వర గౌడ్ పరామర్శించారు. నిస్సార్ నివాసానికి వెళ్లిన ఆయన, నిస్సార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామేశ్వర గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్తకూ, నాయకుడికీ తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ రుణాల్లో సిబిల్ స్కోర్ తొలగించాలి : ఛైర్మన్‌కు జక్కి శ్రీకాంత్ వినతి



ఇది కద నిజం, మే18 హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్ఎస్ భవన్‌లో చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ...ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరులో బ్యాంకులు సిబిల్ స్కోర్ పేరుతో లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. కార్పొరేషన్ రుణాలకు సిబిల్ స్కోర్ విధానాన్ని తొలగించాలని చైర్మన్‌ను కోరారు. నల్లబెల్లి గ్రామపంచాయతీకి అధిక సంఖ్యలో రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై చైర్మన్ ప్రీతం సానుకూలంగా స్పందించి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు.

# పాలమూరుకు ద్రోహం చేసిన బీఆర్ఎస్ పాదయాత్రలు చేయడం సిగ్గుచేటు

## టీఆర్ఎస్ నేతల ఆగ్రహం




ఇది కద నిజం:హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మహబూబ్ నగర్ టీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలంటూ వచ్చే నెలలో పాదయాత్ర చేపట్టడం ఒక పెద్ద డ్రామా అని వారు మండిపడ్డారు. ప్రాజెక్ట్ ఖర్చును రూ. 35 వేల కోట్ల నుండి రూ. 85 వేల కోట్లకు పెంచి కాంట్రాక్టర్ల కడుపు నింపారే తప్ప, ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వేల కోట్లు దోచుకోగా, బీఆర్ఎస్ నేతలు నిరంజన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డిలు ఫైనాన్స్ కంపెనీల పేరుతో భూ నిర్వాసితులైన రైతుల డబ్బులను సైతం దోచేశారని ఆరోపించారు. ఈ నెల 8న లక్ష్మీదేవి పల్లి వద్ద కవిత నిర్వహించిన భారీ సభతో బీఆర్ఎస్ పార్టీలో ఉలికిపాటు మొదలైందని, ప్రజల వ్యతిరేకతను తట్టుకోలేకే ఇప్పుడు పాదయాత్రల పేరుతో కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. ఇదే సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ బిడ్డే అయినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఈ ప్రాజెక్టు కోసం తట్టెడు మట్టి కూడా తీయలేదని దుయ్యబట్టారు. పాలమూరు వలసలకు, వెనుకబాటుతనానికి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ప్రజలకు క్షమాపణ చెప్పకుండా పాదయాత్రలు చేస్తే ప్రజలు ఎన్నటికీ క్షమించరని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కచ్చితంగా టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు కవిత నాయకత్వంలోనే ఈ పాలమూరు ప్రాజెక్ట్ పూర్తవుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

- నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

## టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత






ఇది కద నిజం,హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు. మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు

# సినిమా న్యూస్

## కాక్‌టైల్-2' ఈవెంట్‌లో నోరుజారిన రష్మిక



టాలీవుడ్ స్టార్ బ్యూటీ రష్మిక, కృతి సనన్, షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ ఫాంటసీ థ్రిల్లర్ 'కాక్‌టైల్-2'. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన 'కాక్‌టైల్'కు సీక్వెల్‌గా రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తుండగా.. ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసిన చిత్రబృందం ఓ సాంగ్ లాంచ్ చేయగా.. ఈ వేడుకల్లో పాల్గొన్న రష్మిక నోరు జారి బూతు పదం పలకడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. రష్మిక తన కోస్టార్ కృతి సనన్‌పై ప్రశంసలు కురిపిస్తూ.. అనకూడని మాట అనేయడంతో నెటిజన్లు షాక్ అవుతున్నారు. "కాక్‌టైల్-2లో ఏదో ఒక కొత్త దనం ఉంది.

కృతి నువ్వు చాలా హాట్‌గా ఉన్నావు. ఈ విషయం ప్రపంచం మొత్తానికి తెలుసు. అండ్ యూ ఆర్ ఫింగ్ హాట్ అని అనేసింది. కానీ వెంటనే తాను బూతు మాట అన్నానని గుర్తించిన నేషనల్ క్రష్ వెంటనే తన చేతులతో నోరు మూసుకుంది. అంతేకాకుండా తన తప్పును సరిచేసుకుంది. సారీ చెబుతూ.. దాన్ని సైలెన్స్ సెన్సార్ చేసయేయండి అని హిలేరియస్‌గా కౌంటర్ ఇచ్చింది. అలాగే ఆమె చాలా అమేజింగ్.. లుక్ ఎట్ హర్, మా మధ్య చాలా ఎక్కువ ప్రేమ నడుస్తోందని తెలిపింది. ఇక ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో రష్మిక వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రష్మిక కాస్త హద్దులు దాటి ప్రవర్తించిందని కొందరు విమర్శిస్తుంటే మరికొందరు మాత్రం తన అభిప్రాయం చెప్పడం తప్పు కాదని సమర్థిస్తున్నారు.



## 'పెద్ది' ట్రైలర్ విడుదల

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్ర ట్రైలర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఈ ట్రైలర్ అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ చిరంజీవి, నిర్మాత నాగవంశీ వంటి సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపించడంతో ట్రైలర్ పై అంచనాలు మరింత పెరిగాయి. మరి భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుందో పరిశీలిద్దాం.

ట్రైలర్‌లో ఎక్కువ భాగం రామ్ చరణ్ పాత్ర చుట్టూనే సాగింది. ఇందులో చరణ్ పలు విభిన్న లుక్స్‌లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా క్రికెటర్‌గా, కుస్తీ వీరుడిగా ఆయన కనిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అంతేకాకుండా రన్నర్ పాత్రలో కూడా చరణ్ కనిపించనున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. ప్రతి సన్నివేశంలోనూ తన నటనతో రామ్ చరణ్ ఆకట్టుకున్నాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక రామ్ చరణ్ తర్వాత జాన్వీ కపూర్, శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు పాత్రలకు కూడా ట్రైలర్‌లో ప్రాధాన్యం ఇచ్చారు.

వీరంతా తమ తమ పాత్రల పరిధిలో బాగానే ఆకట్టుకున్నట్లు కనిపిస్తోంది. సాంకేతిక అంశాల పరంగా చూస్తే, ఏఆర్ రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. మూడు నిమిషాలకు పైగా నిడివితో వచ్చిన ఈ ట్రైలర్‌లో ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు పుష్కలంగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## శ్రీలీల షాకింగ్ నిర్ణయం

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీ, తమిళ చిత్రాల్లో నటిస్తూ ఎంతో బిజీగా గడుపుతోంది. అయితే వరుసగా సినిమా అవకాశాలు అందుకుంటున్నప్పటికీ, ఈ ముద్దుగుమ్మకు బాక్సాఫీస్ వద్ద అదృష్టం మాత్రం కలిసి రావడం లేదు. సరైన భారీ హిట్ పడకపోవడంతో ఆమె కెరీర్ కాస్త ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈక్రమంలో.. శ్రీలీల ఒక ఊహించని షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ఒక వార్త విపరీతంగా హల్చల్ చేస్తోంది. ఒకప్పుడు చేతినిండా సినిమాలతో రోజుకు రెండు షిఫ్ట్‌లు మారుస్తూ, అస్సలు క్షణం తీరిక లేకుండా గడిపిన ఈ బ్యూటీ.. ఇప్పుడు వెండితెరకు కొన్నాళ్ల పాటు దూరం కాబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ వార్త తెలియడంతో ఈ డ్యాన్సింగ్ క్వీన్ అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురవుతున్నారు. అయితే శ్రీలీలకు అవకాశాలు రాక ఖాళీగా ఉందా అంటే.. అస్సలు కాదు! ఆమె కావాలనే సినిమాలకు బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

సినిమాల్లోకి రాకముందే శ్రీలీల ఎంబీబీఎస్ చదువుతోంది. గతంలో షూటింగుల బిజీ వల్ల సరిగ్గా చదువుకోలేక, పరీక్షలను కూడా వాయిదా వేసుకుంది. ఇటీవల డాక్టర్ పట్టా పొందిన శ్రీలీల ఇప్పుడు తన ప్రొఫెషనల్ లైఫ్ కంటే.. చదువుకోవాలని గట్టిగా డిసైడ్ అయ్యిందట. హడావుడిగా సినిమాలు చేయడం కంటే, ప్రస్తుతం తన దృష్టినంతా చదువుపైనే పెట్టాలని ఈ షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.శ్రీలీల తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆమె అభిమానులు కాస్త అప్సెట్ అయినప్పటికీ, ఇది ఆమె భవిష్యత్తుకు మంచిదేనని భావిస్తున్నారు. తన చదువు పూర్తయిన తర్వాత, మళ్లీ సరికొత్త కథలతో, మంచి ప్రాజెక్ట్‌లను ఎంచుకుని సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయాలని ఆమె ప్లాన్ చేసుకుంటోందట.

## 'జెట్లీ' ఓటీటీ విడుదల తేదీ వచ్చేసింది

ప్రముఖ కమెడియన్ సత్య ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జెట్లీ'. ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదలైంది. మంచి అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి పర్వాలేదనే టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద యావరేజ్ ఫలితాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్ర డిజిటల్ హక్కులను జియో హాట్‌స్టార్ సంస్థ దక్కించుకుంది. ఇందులో భాగంగా మే 25 నుంచి ఈ సినిమాను తమ వేదికలో ప్రసారం చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ చిత్రాన్ని వీక్షించే అవకాశం పొందనున్నారు. ఇక ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో రియా సింఘా హీరోయిన్‌గా నటించగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించాడు. 'మత్తు వదలరా' ఫేమ్ రితేష్ రాణా దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందించారు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పించింది.




## సుడిగాలి సుధీర్ కొత్త సినిమా

జబర్దస్త్ కామెడీ షో ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటుడు, యాంకర్ సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాకు 'సుధీర్ జోకర్' అనే టైటిల్‌ను ఖరారు చేసిన మేకర్స్, తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. టైటిల్‌ను బట్టి చూస్తే ఈ చిత్రం పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. విడుదలైన పోస్టర్‌లో సుడిగాలి సుధీర్ స్టైలిష్ అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకున్నాడు. నోట్లో సిగరెట్, చేతిలో కార్డ్స్ పట్టుకుని భిన్నమైన లుక్‌లో కనిపించిన ఆయన పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌ను పరిశీలిస్తే ఈ చిత్రంలో కామెడీతో పాటు ఆసక్తికరమైన అంశాలు కూడా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి పీఎస్ సునీల్ పుప్పాల కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. అహ్మద్ షరీఫ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. అయిషా ఇందులో హీరోయిన్గా కనిపించబోతుంది. ఇక ఈ చిత్రంతో సుడిగాలి సుధీర్ హీరోగా ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

